సాక్షి సంగారెడ్డి

సోమవారం : 24 : ఏప్రిల్ : 2023



చెరువు.. చెర 8లో

కొమురవెల్లి మల్లన్న ఆలయానికి నిత్యం భక్తుల రద్దీ ఉండడంతో పరిసర గ్రామాల్లో ఒక్కసారిగా భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. దీంతో కొందరు రియల్టర్ల కన్ను చెరువులపై పడింది.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష

కొండాపూర్(సంగారెడ్డి): తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 5వ తరగతిలో చేరేందుకు నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఆదివారం జరిగింది. సంగారెడ్డి జిల్లాలో 19, మెదక్‌లో 7 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. సంగారెడ్డి, మెదక్ జిల్లాలకు చెందిన 7703 మందికి 7213 మంది హాజరయ్యారు. 490 మంది గైర్హాజరైనట్లు ఆర్‌సీఓ భీమయ్య తెలిపారు.

కొనసాగుతున్న కోవిడ్ ర్యాపిడ్ టెస్టులు



పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొన సాగుతున్నాయి. ఆదివారం ఎనిమిది కోవిడ్ ర్యాపిడ్ టెస్టులు నిర్వహించారు. అందులో అందరికీ నెగెటివ్ వచ్చినట్లు టెస్టుల నిర్వాహకులు మనోహర్ తెలిపారు. ఆర్టీపీసీఆర్ టెస్టులు నిర్వహించలేదన్నారు.

న్యూస్‌రీల్

వీఓఏల సమస్యలు పరిష్కరించాలి

ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి



వీఓఏల సమ్మెకు మద్దతు తెలుపుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి

పటాన్‌చెరుటౌన్: వీఓఏల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహా రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వీఓఏల సమస్య పరిష్కారం కోసం బ్లాక్ ఆఫీసు సమీపంలో నిర్వహిస్తున్న నిరవధిక సమ్మెకు ఆదివారం మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించటంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. వారికి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. సెర్ప్ నుంచి గుర్తింపు కార్డులు, యూనిఫాం ఇచ్చి ప్రతీ వీఓఏకి సాధారణ బీమా సౌకర్యం కల్పించాలన్నారు. వీఓఏల గౌరవ వేతనం నేరుగా వారి బ్యాంక్ ఖాతాలోనే జమ చేయాలని, లేదంటే త్వరలో సెక్రటేరియట్, ప్రగతి భవన్ ముట్టడికి వెనుకాడబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు నాగేశ్వర రావు, మాజీ సర్పంచ్ సంజీవరెడ్డి, యువరాజ్, కిషన్, తదితరులు పాల్గొన్నారు.

టీసీజీటీఏ జిల్లా అధ్యక్షుడిగా అడవిరాజు



డాక్టర్ అడవిరాజును సన్మానిస్తున్న దృశ్యం

జోగిపేట(అందోల్): తెలంగాణ కాలేజియేట్ గజిటెడ్ టీచర్స్ అసోసియేషన్(టీసీజీటీఏ) 2023–25 సంవత్సరానికి సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా జోగిపేట నెహ్రూ మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.అడవిరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం సంగారెడ్డి జిల్లా తారా డిగ్రీ కళాశాలలో జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు డాక్టర్ పి.అడవిరాజు మాట్లాడుతూ జిల్లాలోని డిగ్రీ కళాశాలల అధ్యాపకుల సమస్యలను సత్వర పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. డిగ్రీ కళాశాలల బలోపేతానికి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా పూర్వ అధ్యక్షుడు, జనరల్ సెక్రటరీలు, డాక్టర్ ఏ.వెంకటేశం, అల్లం రెడ్డి, డాక్టర్ జలీల్, జిల్లాలోని వివిధ కళాశాలల అధ్యాపకులు పాల్గొన్నారు.

టీజీసీజీటీఏ నూతన కార్యవర్గం

కొండాపూర్(సంగారెడ్డి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కళాశాల గెజిటెడ్ అధ్యాపకుల నూతన కార్యవర్గాన్ని ఆదివారం జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా అడవి రాజు, ఉపాధ్యక్షుడిగా లచ్చయ్య, ట్రెజరరీగా సుజాత ఎన్నికయ్యారు. కార్యదర్శి పదవికి పోటీచేసిన జలీల్ పది ఓట్లతో విజయం సాధించారు.

తెలంగాణ సంస్కృతిని చాటిన పట్నం మాన్యత



తెలంగాణ తల్లి వేషధారణలో పట్నం మాన్యత

సంగారెడ్డిటౌన్: తెలంగాణ తల్లి తెలంగాణ ప్రజలకు ప్రతీకాత్మకమైన మాతృదేవత. తెలంగాణ సంస్కృతిని ఇతర రాష్ట్రాలకు మరొకసారి తెలియజేసింది. ఇన్‌స్టాగామ్, యూట్యూబ్ స్టార్ పట్నం మాన్యత సంగారెడ్డి జిల్లా సంగారెడ్డి మండలం ఫసల్వాది గ్రామం. జూనియర్ మిస్ ఇండియా 2023 పోటీలు 2022 నవంబర్‌లో హైదరాబాదులో నిర్వహించారు. 15 రాష్ట్రాల నుంచి ఈ పోటీలలో పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్రం నుంచి పట్నం మాన్యత సెమీ ఫైనల్‌కి సెలెక్ట్ అయ్యింది. ఏప్రిల్‌లో ఫైనల్ పోటీలు ముంబైలో నిర్వహించారు. 27 రాష్ట్రాలు పోటీపడ్డారు. పట్నం మాన్యత తెలంగాణ తల్లి వేషధారణలో కట్టు, బొట్టు చేతిలో బతుకమ్మతో ప్రదర్శించి ఫైనల్‌కు చేరింది. మాన్యతకి సంగారెడ్డి వాసులు అభినందనలు తెలియజేస్తూ ఫైనల్లో నెగ్గాలని ఆకాంక్షించారు.

నేటి నుంచి కుంభమేళా

- 12 రోజులు పాటు జరగనున్న కార్యక్రమం
- క్షేత్రానికి చేరుకుంటున్న నాగ సాధువులు
- హాజరుకానున్న ప్రముఖులు
- చర్యలు చేపట్టాలని అధికారుల ఆదేశాలు



మంజీరా నది వద్ద భక్తుల స్నానాల కోసం ఏర్పాట్లు

న్యాల్‌కల్(జహీరాబాద్): రెండో బాసరగా విరాజిల్లుతున్న న్యాల్‌కల్ మండల పరిధిలోని పంచవటి క్షేత్రం మంజీరా కుంభమేళా నిర్వహణకు సర్వం సిద్ధమైంది. సోమవారం నుంచి ప్రారంభమయ్యే కుంభమేళా మే 5వ తేదీ వరకు కొనసాగుతుంది. 12 రోజుల పాటు నిర్వహించే కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులు, నిర్వాహకులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటి వరకు మూడుసార్లు విజయవంతంగా నిర్వహించిన కుంభమేళాను నాలుగో సారీ భారీ ఎత్తున నిర్వహించనున్నారు. మేళాలో ముఖ్యంగా నాగ సాధువులు భక్తులను ఆకట్టుకుంటారు.

- నాసిక్, హరిద్వార్, ఉజ్జయిని తదితర ప్రాంతాల నుంచి నాగ సాధువులు వస్తున్నారు. ఇప్పటి వరకు కొంత మంది రాగా సోమవారం ఉదయం వరకు వందలాది సాధువులు చేరుకుంటారని క్షేత్రం పీఠాధిపతి కాశీనాథ్‌బాబా తెలిపారు.
- 12 రోజుల పాటు నిర్వహించే కుంభమేళా కార్యక్రమంలో భాగంగా ఈనెల 24న సంగ్రాం మహారాజ, శంకర్ భారత్ మహారాజ్, గజేంద్ర భారతి మహారాజ్, రాజశేఖర్ శివయోగీ, 25న బసవలింగ పట్టదేవరు బాల్కి మఠం, వెంకట స్వామి, దత్తు మహారాజ్ హాజరుకానున్నారు.
- అదే రోజు అక్కమహాదేవి నాటక ప్రదర్శన ఉంటుంది. 26న దేవగిరి మహారాజ్, సచ్చిదానంద సద్గురు మహారాజ్, 27న శివయోగేశ్వర్ స్వామి, 28న మహానంద సరస్వతి, మంత్రి హరీశ్‌రావు, 29న మల్లయ్యగిరి మహారాజ్, 30న దత్తగిరి మహారాజ్, మే 1వ తేదీన శివానందస్వామి, 2న బసవాంబికామాత, 3న మణికంఠ శివాచార్య మహాస్వామి, 4న జగదీశ్వరీ మాత, 5న మృగరాజేందర్ మహారాజ్‌తో పాటు ఇతర మహారాజ్‌లు హాజర వుతారని కాశీనాథ్‌బాబా తెలిపారు.
- మఠాధిపతులతో పాటు మంత్రి హరీశ్‌రావు, ఎంపీ బీబీ పాటిల్, నారాయణఖేడ్, జహీరాబాద్ శాసన సభ్యులు భూపాల్‌రెడ్డి, మాణిక్ రావు, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, మాజీ మంత్రి గీతారెడ్డి, జిల్లా కలెక్టర్ తదితరులు హాజరవుతారన్నారు.

నిత్యం సాంస్కృతి కార్యక్రమాలు

కుంభమేళాను పురస్కరించుకొని పంచవటి క్షేత్రంలో నిత్యం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. కూచిపూడి నృత్యం, అక్కమహాదేవి భజన మండలి సంగీత్ దర్బార్ కార్యక్రమాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.

సక్రమంగా పారిశుద్ధ్య నిర్వహణ

- కుంభమేళాలో పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా ఉండేలా చూడాలని జహీరాబాద్ డీఎల్‌పీఓ రాఘవారావు అధికారులు, పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు.
- ఆదివారం మధ్యాహ్నం పంచవటి ఆవరణలో ఎంపీడీఓలు, ఎంపీఓలు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు.
- 12 రోజుల పాటు నిర్వహించే కార్యక్రమాలకు సంబంధించిన ప్రణాళికలను తప్పకుండా అమలు చేయాలని సూచించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు.

మొరం మట్టిని వేయకపోవడంతో..

- న్యాల్‌కల్ నుంచి పంచవటి మీదుగా నారాయణఖేడ్ వెళ్లే రోడ్డుకు ఇరువైపులా మొరం మట్టిని వేయకపోవడంతో కుంభమేళాకు వచ్చే భక్తులు ఇబ్బందులు పడుతున్నారు.
- రోడ్డుకు అక్కడక్కడ కొన్ని ప్రాంతాల్లో మట్టి వేయించిన అధికారులు మిగతా ప్రాంతాల్లో వేయకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు.
- ఇరుకు రోడ్డు కావడం, దానికి రెండు వైపులా గుంతలను పూడ్చకపోవడంతో రాకపోకలు సాగించే వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు రోడ్డుకు ఇరువైపులా మొరం మట్టిని వేయించాలని ప్రజలు కోరుతున్నారు.



పంచవటి క్షేత్రంలో కాశీనాథ్‌బాబాతో మాట్లాడుతున్న నాగ సాధువులు



పంచవటిలో కొలువుదీరిన శారదాదేవి



బసవేశ్వరుడి జయంతిలో జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ జైపాల్ రెడ్డి తదితరులు

బసవేశ్వరుడి ఆశయాలు అందరికీ ఆదర్శం

జెడ్పీ చైర్ పర్సన్ మంజుశ్రీ జైపాల్ రెడ్డి

సంగారెడ్డిటౌన్: మహాత్మా బసవేశ్వరుడి ఆశయాలు అందరికీ ఆదర్శమని జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ జైపాల్ రెడ్డి అన్నారు. మహాత్మా బసవేశ్వరుడి 890వ జయంతిని పురస్కరించుకుని ఆదివారం సంగారెడ్డి బైపాస్‌లోగల బసవేశ్వరుడి విగ్రహానికి జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ, చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్, మున్సిపల్ చైర్ పర్సన్ విజయలక్ష్మి, వివిధ కుల సంఘాల ప్రతినిధులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ సంఘ సంస్కర్త, సామాజిక తత్వవేత్త బసవేశ్వరుడు ఆనాటి సమాజంలో కుల, వర్ణ, లింగ వివక్షతను వ్యతిరేకించి, అందరూ సమానమేనని చాటి చెప్పిన అభ్యుదయవాదని కొనియాడారు. 12వ శతాబ్దంలోనే మహిళలకు ప్రత్యేక స్థానం కల్పించిన మహోన్నత వ్యక్తి అన్నారు.

కలెక్టరేట్ సమావేశ మందిరంలో..

వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన బసవేశ్వరుడి జయంతి కార్యక్రమంలో ఆర్డీవో నగేష్, జిల్లా అధికారులు, కుల సంఘాల నాయకులు బసవేశ్వరుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆర్డీవో నగేశ్ మాట్లాడుతూ ఏప్రిల్లో మహనీయుల జయంతులను అధికారికంగా జరుపుకుంటున్నామన్నారు. బసవేశ్వరుడు సమ సమాజ స్థాపన కోసం పాటుపడ్డాడని, ఎన్నో సంస్కరణలకు నాంది పలికి, సంస్కరించిన ప్రముఖులలో ఆయన ఒకరన్నారు. మహనీయుల బోధనలు అందరూ పాటిస్తూ మంచి మార్గంలో నడవాలన్నారు. కార్యక్రమంలో చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్, వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి జగదీష్, జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

చివరి గింజ వరకూ కొనుగోలు చేస్తాం



హత్నూరలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మదన్ రెడ్డి

సాక్షి ఎఫెక్ట్..

నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

హత్నూర(సంగారెడ్డి): సాక్షి దినపత్రికలో ఆదివారం ప్రచురితమైన 'అకాల వర్షంతో ఆగం' శీర్షికపై స్పందించిన ఎమ్మెల్యే మదన్ రెడ్డి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. ఆదివారం సాయంత్రం మండల కేంద్రమైన హత్నూర సొసైటీ, ఐకేపీ కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు అధైర్య పడొద్దని, తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ఏర్పాటు చేస్తామన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు అన్ని సౌకర్యాలు కల్పించి త్వరితగతిన ధాన్యాన్ని తూకం వేసేలా చర్యలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల పక్షపాతిగా రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తుందన్నారు. సాగు పెట్టుబడి రైతు బీమా పథకాలను కూడా దేశంలో ఎక్కడా అమలు చేయడం లేదని సీఎం కేసీఆర్ రైతుల సంక్షేమం కోసం రాష్ట్రంలో ఇస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ నర్సింహులు, పీఏసీఎస్ చైర్మన్ దుర్గారెడ్డి, సర్పంచ్ వీరస్వామి గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, రైతు సమన్వయ సమితి మండల కోఆర్డినేటర్ బుచ్చిరెడ్డి, సీసీ మహేష్, సొసైటీ డైరెక్టర్ రాములు, నాయకులు కిషోర్ మహంకాళి నాగేష్, రవి, ఇస్మాయిల్, లక్ష్మీనారాయణ, రాములు, మేరాజ్, సాయి కుమార్, ధనుంజయ, వీవోఏ లక్ష్మయ్య, ఐకేపీ, సొసైటీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రాజ్యాంగ హక్కుల పరిరక్షణకు జగ్జీవన్‌రామ్ కృషి

ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ

కోహీర్(జహీరాబాద్): రాజ్యాంగ హక్కుల పరిరక్షణకు దివంగత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ కీలక భూమిక పోషించారని ఎమ్మార్పీఎస్ (మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి) జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో ఆదివారం సాయంత్రం దివంగత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహావిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అణగారిన వర్గాల ప్రజల సమన్యాయం సాధించడానికి జగ్జీవన్‌రామ్ కృషి చేశారన్నారు. ఆయన విగ్రహాలను ఆవిష్కరించే అవకాశం లభించడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. డాక్టర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రామ్, మహాత్మా జ్యోతిబా పూలే నిమ్న జాతులకు చేసిన సేవలు ఎప్పటికి మరవలేనివన్నారు. వారి అడుగు జాడల్లో నడవాల్సిన అవసరం ఉందన్నారు. అంతకుముందు మందకృష్ణ మాదిగను సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజశేఖర్, జెడ్పీటీసీ రాందాస్, పీఏసీఎస్ చైర్మన్ స్రవంతిరెడ్డి, ఎంపీటీసీ మల్లన్నపాటిల్, మాజీ సర్పంచ్ మల్లికార్జున్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మందకృష్ణ మాదిగ

విద్యా వ్యతిరేక విధానాలపై..

- సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలి
- ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాటికొండ రవి

కొండాపూర్(సంగారెడ్డి): విద్యార్థి వ్యతిరేక విధానాలపై సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాటికొండ రవి పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా విద్యా, వైజ్ఞానిక శిక్షణ తరగతులు ముగిశాయి. విద్యార్థి ఉద్యమం, నూతన విద్యా విధానం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల విద్యార్థులను విద్యకు దూరం చేసే విధంగా నూతన విద్యా విధానం తెచ్చిందన్నారు. దీనిపై ఎస్‌ఎఫ్‌ఐ పోరాటాలు చేసిందని, దీంతో వెనక్కి తగ్గి కరోనా సమయంలో దొంగచాటున ఈ విద్యా విధానం తీసుకొచ్చి బలవంతంగా అమలు చేసే ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. ఒకే జాతి, ఒకే భాష నినాదాలతో విద్యార్థులను మోసం చేస్తోందని, ఈ నూతన విద్యా విధానం ఇంటర్‌లో ఉన్న వత్తి విద్య కోర్సులను తొలగించి హైస్కూల్‌లో విలీనం చేసి కార్మికులుగా మార్చడమే విద్య లక్ష్యమన్నారు. దీంతో విద్యార్థులు బానిసలుగా మారడం తప్ప మరొక మార్గం లేదన్నారు. ఉన్నత విద్యలో మూడేళ్ల కోర్సులను నాలుగేళ్లకు పొడిగించడం, సంవత్సరం ఉన్న బీఈడీ కోర్సు రెండేళ్లు చేయడం, శాస్త్రీయ విద్యా విధానాన్ని మార్చే మూఢ విశ్వాసాలు కల్పించే విద్యా విధానాన్ని తీసుకురావడం అంటే సమాజాన్ని మూఢత్వంలోకి నెట్టడం తప్ప మరొకటి కాదన్నారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నూతన విద్యా విధానాన్ని వెనకి తీసుకోవాలని లేదంటే ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి మాణిక్యం, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మహేష్, రమేశ్ ఉపాధ్యక్షులు సతీష్ సహాయ కార్యదర్శి రాజేష్, రజినీకాంత్, వాణి, కమిటీ సభ్యులు వంశీ, సుధాకర్, మల్లేష్, హరీశ్, దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాటికొండ రవి

ఉన్నత చదువున్నా.. ఉపాధి బాట

- స్వశక్తిపై నిలబడుతున్న యువత
- కారు గ్యారేజ్‌లకు మంచి డిమాండ్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఉన్నత చదువులు చదువుకున్న యువత స్వయం ఉపాధి బాట పడుతున్నారు. వారు చదుకున్న చదువుకు, చేస్తున్న వృత్తికి పొంతన లేకున్నా, ఆ వృత్తిలో నైపుణ్యం సంపాదించి ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతున్నారు. రోజురోజుకు ఈ ప్రాంతం అభివృద్ధి చేందుతోంది. ప్రతీ ఇంటికి ఒక కారు ఉండటంతో ఈప్రాంతంలో కారు గ్యారేజ్‌లకు డిమాండ్ పెరిగింది. దీంతో యువత కారు గ్యారేజ్‌లు, కారు వాషింగ్ సెంటర్‌లను ఏర్పాటు చేస్తున్నారు. వీటి ద్వారా ఉపాధి పొందుతూ మరో పది మందికి ఉపాధి కల్పిస్తున్నారు. పటాన్‌చెరు, అమీన్‌పూర్, రామచంద్రాపురం ప్రాంతలలో సుమార్ 50 పైగా కారు గ్యారేజ్‌లున్నాయి. ఒకొక్క కారు గ్యారేజ్‌లో సుమారు 10 నుంచి 15 కుటుంబాలు ఉపాధి పొందుతున్నాయి. సుమారు 500 కుటుంబాలు ఈ రంగంపై ఆధారపడ్డాయి. మంచి నైపుణ్యం ఉన్న మెకానిక్‌లను నియమించుకొని తమ గ్యారేజ్‌లను అభివృద్ధి చేస్తున్నారు. కారు గ్యారేజ్‌లో మెకానికులు వారికి సహాయకులు, పెయింటర్, డెంటర్, వెల్డర్, ఎలక్ట్రిషన్‌లు జీవనోపాధి పొందుతున్నారు. కారు మరమ్మతులు షోరూంలో కన్నా గ్యారేజ్‌లో తక్కువ చార్జీలతో మరమ్మతులు చేస్తుండటంతో కారు యజమానులు గ్యారేజ్‌లను ఆశ్రయిస్తున్నారు. ఈ రంగంలో పనిచేసే వారు బయటకు వెళ్లి మరొకపని చేసుకోలేని పరిస్థితి .



కారు మరమ్మతు చేస్తున్న మెకానిక్‌లు

లాక్‌డౌన్‌లో అండగా...

లాక్‌డౌన్‌లో కారు గ్యారేజ్‌లో పని లేకపోయిన అందులో పని చేసే వారిని కంటికి రెప్పల చూసుకున్నారు గ్యారేజ్ నిర్వాహకులు. వారికి ధైర్యం చెప్పి కొంతమంది జీతాలు కుడా ఇచ్చారు.

మైనింగ్‌లో డిప్లామా చదివా



మైనింగ్‌లో డిప్లామా చేశాను. మా తండ్రి అఫ్జల్ ఖాన్ భెల్ కార్మికుడు. మాకు భెల్ టౌన్‌షిప్‌లో కారు గ్యారేజ్ ఉంది. నా చదువు పూర్తి చేసుకున్న తరువాత గ్యారేజ్ చూసుకుంటున్నా. భెల్‌లో ఉండగా 20మంది పనిచేసే వారు. ప్రస్తుతం తెల్లాపూర్‌లో నిర్వహిస్తున్నా. పది మంది పనిచేస్తున్నారు. ఈ రంగంలో నేను సంతోషంగా ఉన్నాను.

– ఎంఏ ఖాన్, గ్యారేజ్ నిర్వాహకుడు, తెల్లాపూర్

హోటల్ వ్యాపారం చేద్దామనుకున్నా ..



సంగారెడ్డిలో ఐటీఐ చేశాను. ఓఆర్ఆర్ టోల్ ప్లాజాలో సూపర్‌వైజర్‌గా పనిచేశా. హోటల్ వ్యాపారం చేద్దామని ఉద్యోగానికి రాజీనామా చేశా. ఆ సమయంలో మాకు తెలిసిన వారు ఈ గ్యారేజ్ విక్రయిస్తుంటే కొనుగోలు చేశాను. ఈ వ్యాపారం బాగుంది. నేను ఉపాధి పొందుతూ మరో 13 మందికి ఉపాధి కల్పించా.

– అంజనేయులు, జనతా గ్యారేజ్ నిర్వాహకుడు, ముత్తంగి

క్లుప్తంగా

వైభవంగా శివపార్వతుల కల్యాణం

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): మండల పరిధిలోని కొల్కూర్ గ్రామంలో ఆదివారం శివ పార్వతుల కల్యాణాన్ని వేదపండితులు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు తమ మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు భూపాల్ రెడ్డి, గంగన్న, నాయకులు మాణిక్ రెడ్డి, మాణిక్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ అసత్య ప్రచారాన్ని నమ్మరు



నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

సిద్దిపేటజోన్: అధికారంలోకి రావడానికి బీజేపీ చేస్తున్న అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మరని, మాజీ మంత్రి ఈటెల రాజేందర్‌కు ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెబుతారని కాంగ్రెస్ నాయకులు విమర్శించారు. ఆదివారం ఈటెల రాజేందర్ అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ ముస్తాబాద్ చౌరస్తాలో వారు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు అత్తు మాట్లాడుతూ.. బీజేపీ అబద్ధాల పార్టీ అన్నారు. అసత్య ఆరోపణలు చేస్తూ రాజకీయ లబ్ధి కోసమే ఈటెల ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు చంద్రం, యాదగిరి, లక్ష్మి, భిక్షపతి, స్వప్న, పావని, లక్ష్మీ, రజని, తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా యువకుడి మృతి

నారాయణఖేడ్: చేపలు పట్టేందుకు వెళ్లిన యువకుడు కుంటలో అనుమానాస్పదంగా మృతి చెందాడని నారాయణఖేడ్ ఎస్‌ఐ వెంకటరెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని లింగపూర్‌కు చెందిన స్నేహితులు గైని శ్రీకాంత్(23), ఎర్రోళ్ల అశోక్ గ్రామ సమీపంలోని ఊర కుంటలో చేపలు పట్టేందుకు వెళ్లారు. గైని శ్రీకాంత్ కుంటలో అనుమానస్పదంగా మృతి చెందాడని ఎస్‌ఐ పేర్కొన్నారు. మృతుడి తండ్రి గైని బాలయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు.

చికిత్స పొందుతున్న మహిళ మృతి



సంగారెడ్డి టౌన్: చికిత్స పొందుతూ మహిళ మృతిచెందిన సంఘటన సంగారెడ్డిలోని పోతిరెడ్డిపల్లిలో చోటుచేసుకుంది. రూరల్ ఎస్‌ఐ శ్రీనివాస్ రెడ్డి తెలిపిన కథనం ప్రకారం.. పోతిరెడ్డిపల్లిలోని కింగ్స్ ఫర్నీచర్ సమీపంలో ఈ నెల 21న ఓ మహిళ ప్రసవించింది. ఆమెను 108లో సంగారెడ్డిలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్సపొందుతూ ఆ మహిళ మృతిచెందింది. అయితే ఆస్పత్రిలో చేర్పించే సమయంలో తనపేరు మంజుల భర్త రాజు, గ్రామం సదాశివపేట అని అడ్మిషన్‌లో రాయించింది. ఆమె తెలిపిన అడ్రస్ కోసం వెళితే అక్కడ ఆమె వివరాలు తెలియలేదు. ప్రస్తుతం మహిళ మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచినట్టు ఎస్‌ఐ తెలిపారు. ఆచూకీ తెలిసినవారు 8712656719, 8712656746 నంబర్లకు ఫోన్‌చేయాలని పేర్కొన్నారు.

ఎండీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా వేణు

బెజ్జంకి(సిద్దిపేట): మున్నూరు కాపు డెవలప్‌మెంట్ ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా గుండారం గ్రామానికి చెందిన సాన వేణును నియమించినట్లు ఆ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు ఎడ్ల రవికుమార్ పటేల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సాన వేణు మాట్లాడుతూ తనకు రెండో సారి బాధ్యత ఇచ్చినందుకు రవికుమార్‌పటేల్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

చెరువు.. చెర

ఎఫ్‌టీఎల్‌లో పూడ్చివేతల పర్వం





ఎర్ర చెరువు ఎఫ్‌టీఎల్‌లో మట్టితో పూడ్చివేత ఇలా...

కొమురవెల్లి(సిద్దిపేట): మల్లన్న ఆలయానికి నిత్యం భక్తుల రద్దీ ఉండడంతో పరిసర గ్రామాల్లో ఒక్కసారిగా భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. దీంతో కొందరు రియల్టర్ల కన్ను చెరువులపై పడింది. సాగునీరు అందిస్తూ, మత్స్యకారులకు ఉపాధి కల్పించే చెరువులను కూడా మట్టితో నింపుతున్నారు. మండలపరిధిలోని అయినాపూర్‌లో ఉన్న ఎర్ర చెరువుపై కొందరి కన్ను పడింది. చెరువు విస్తీర్ణం ఆరు ఎకరాలుండగా, 25 ఎకరాలు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉంది. ఈ చెరువు కింద 25 ఎకరాల ఆయకట్టు ఉంది. తపాసుపల్లి రిజర్వాయర్ కిందనే ఉండటం వల్ల చెరువులో నీరు పుష్కలంగా ఉంటుంది. అయినాపూర్‌కు చెందిన 300 మంది మత్స్యకారులు ఈ చెరువులో చేపలుపెంచి ఉపాధి పొందుతున్నారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో 2మీటర్ల ఎత్తుతో మట్టిపోయడంతో చెరువులోని నీటి వనరులు తగ్గిపోతున్నాయి. మిషన్ కాకతీయ కింద రూ. 30లక్షలతో అధికారులు చెరువుకు మరమ్మతులు చేశారు. చెరువును మట్టితో పూడ్చి వేస్తున్నారని, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులకు స్థానిక మత్స్యకారులు విన్నవించారు.

త్వరలోనే మట్టిని తీసివేయిస్తాం

ఇప్పటికే ఎర్ర చెరువు ఎఫ్‌టీఎల్‌లో మట్టిపోసిన వారిపై కేసు నమోదు చేసి నోటీసులు అందించాము. త్వరలోనే మట్టిని తీసివేయిస్తాం. వారం రోజుల్లో వారు స్పందించకుంటే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం. – శ్యాం, ఇరిగేషన్ డీఈ

అధికారులు పట్టించుకోవడం లేదు



ఎర్ర చెరువును పూడ్చివేస్తున్నారని రెవెన్యూ , ఇరిగేషన్ అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేదు. చెరువు పూడ్చివేతతో మత్స్యకారులు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉంది.

–తేలు ఇస్తారి, మత్స్యపారిశ్రామిక సంఘం జిల్లా డైరెక్టర్

చిట్కుల్ మాజీ సర్పంచ్ ఇంట్లో చోరీ

రూ. 30లక్షల విలువ చేసే బంగారం, నగదు అపహరణ



చిందర వందరగా పడేసిన వస్తువులు

పటాన్‌చెరు టౌన్: చిట్కుల్ మాజీ సర్పంచ్ ఇంట్లో చోరీ జరిగింది. రూ. 30 లక్షలు విలువ చేసే బంగారం, నగదు ఎత్తుకెళ్లిన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పటాన్‌చెరు సీఐ వేణుగోపాల్ రెడ్డి కథనం ప్రకారం..పటాన్‌చెరు మండలం చిట్కుల్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ సుంకరి రవీందర్ కుటుంబ సభ్యులతో ఈ నెల 19వ తేదీన ఉదయం తమిళనాడు కామాక్షి అమ్మవారి దేవాలయం నుంచి తిరుపతి వెళ్లారు. తిరిగి శనివారం రాత్రి 11 గంటలకు ఇంటికొచ్చి చూసే సరికి తలుపులు పగులగొట్టి ఉన్నాయి. వెంటనే మొదటి అంతస్తులోకి వెళ్లి చూడగా రెండు రూముల్లో బీరువాలు పగలగొట్టారు. అందులోని వస్తువులు చిందరవందరగా పడేశారు. ఇంట్లో ఇటీవలే ఏడు గుంటల భూమి అమ్మిన డబ్బుతో పాటు బంగారాన్ని దొంగలు ఎత్తుకెళ్లినట్లు వారు గుర్తించారు. వెంటనే ఈ విషయంపై పోలీసులకు సమాచారం చేరవేశారు. దీంతో సమాచారం తెలుసుకున్న పటాన్‌చెరు సీఐ వేణుగోపాల్ రెడ్డి, ఎస్‌ఐలు, క్లూస్ టీంతో కలిసి ఘటన స్థలాన్ని ఆదివారం సందర్శించారు. బాధితుడు రవీందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సెల్‌ఫోన్ పోగొట్టుకుంటే..

- సీఈఐఆర్‌లో వివరాలు నమోదు చేయాలి
- సిద్దిపేట పోలీస్ కమిషనర్ శ్వేత



యాప్‌కు సంబంధించిన వివరాలు

సిద్దిపేటకమాన్: సెల్‌ఫోన్ ఎక్కడైనా పోగొట్టుకున్నా, ఎవరైనా దొంగిలించినా సీఈఐఆర్ యాప్‌లో లాగిన్ అయి వివరాలు నమోదు చేయాలని సిద్దిపేట పోలీస్ కమిషనర్ శ్వేత సూచించారు. ఏదైనా కారణంతో సెల్‌ఫోన్ పోగొట్టుకుంటే గాబరా పడకుండా ఆ ఫోన్‌ను గుర్తించేలా సీఈఐఆర్ యాప్‌పై ప్రజలకు పోలీసులు అవగహన కల్పిస్తున్నట్లు సీపీ తెలిపారు. ఆన్‌లైన్లో సీఈఐఆర్ యాప్‌లో సెల్ ఫోన్ వివరాలు నమోదు చేస్తే తొందరగా గుర్తించడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ యాప్ ద్వారా సెల్ ఫోన్‌ను బ్లాక్ చేయొచ్చని సూచించారు. పోలీస్ సిబ్బంది ఈ యాప్‌పై ప్రజలకు అవగహన కల్పిస్తున్నట్లు చెప్పారు.

సిద్దిపేట పోలీస్ కమిషనర్ పేరుతో యాప్‌కు సంబంధించిన వివరాలతో వాట్సప్, సోషల్ మీడియా ద్వారా ప్రజలకు అవగహన కల్పిస్తున్నారు.

ప్లీనరీ విజయవంతం చేయాలి

బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ



మాట్లాడుతున్న రాధాకృష్ణశర్మ

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని మెట్టుబండ వద్ద 25న నిర్వహించనున్న బీఆర్‌ఎస్ నియోకవర్గ ప్లీనరీ, మండల ఆత్మీయ సమ్మేళనానికి ప్రజా ప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని ప్లీనరీ, ఆత్మీయ సమ్మేళనం నిర్వహించే స్థలంలో సన్నాహక సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలో పేదల సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. సిద్దిపేటలో జరిగిన అభివృద్ధిపై కార్యకర్తలకు దిశానిర్దేశం చేయనున్నట్లు చెప్పారు. ఆత్మీయ సమ్మేళనం ద్వారా పార్టీ నాయకులు, కార్యకర్తల సమస్యలు తెలుసుకోవడంతో పాటు పార్టీ బలోపేతంపై చర్చించనున్నట్లు చెప్పారు. చిన్నకోడూరులో భారీ జెండా ఆవిష్కరించి బైక్ ర్యాలీతో సభాస్థలికి వస్తారన్నారు. ఎంపీపీ మాణిక్యరెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కామిని శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్‌లు కనకరాజు, సదానందం గౌడ్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు ఉమేష్ చంద్ర, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

కర్ణాటకలోకి ప్రవేశించే వాహనాల తనిఖీ

ఎన్నికల నేపథ్యంలో ప్రత్యేక చెక్‌పోస్టులు



వాహనాల తనిఖీ నిర్వహిస్తున్న పోలీసులు

జహీరాబాద్: తెలంగాణ రాష్ట్రం నుంచి కర్ణాటకలోకి ప్రవేశించే ప్రతీ వాహనాన్ని అక్కడి పోలీసులు క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నారు. కర్ణాటక అసెంబ్లీకి ఎన్నికలు నిర్వహిస్తున్నందునా అక్కడి పోలీసులు తెలంగాణ, మహారాష్ట్రల సరిహద్దుల్లో ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. 65వ జాతీయ రహదారిపై బీదర్ జిల్లాలోని బొంగూరు వద్ద, జహీరాబాద్-బీదర్ రహదారిపై హుసెల్లి శివార్లలో వీటిని ఏర్పాటు చేశారు. మహారాష్ట్ర నుంచి కర్ణాటక మీదుగా తెలంగాణ రాష్ట్రంలోకి వచ్చే వాహనాల తనిఖీ కోసం మహారాష్ట్ర సరిహద్దు వద్ద కర్ణాటక పరిధిలో చెక్ పోస్టు ఏర్పాటు చేశారు. చెక్‌పోస్టుల వద్ద కార్లు, బస్సులు, లారీలను, ఇతర వాహనాలను నిలిపి పరిశీలిస్తున్నారు. కార్లలో ప్రయాణించే ప్రయాణీకులకు సంబంధించిన ప్రతి బ్యాగ్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. అనుమానం ఉన్న వాహనాలను తనిఖీ పూర్తయిన తరువాతే వదులుతున్నారు. ఈ తనిఖీల్లో వాహనాల నెంబరు, వారి సెల్‌ఫోన్ నెంబర్లు, ఎక్కడి నుంచి ఎక్కడకు వెళుతున్నారు. ఏ సందర్భం గురించి వెళ్తున్నారోననే వివరాలు సేకరిస్తున్నారు. వాహనం వెళుతున్న సమయాన్ని కూడా నమోదు చేస్తున్నారు. కర్ణాటక ఎన్నికల నేపథ్యంలో పోలీసులు గట్టి నిఘా పెట్టినట్లు అధికారులు పేర్కొన్నారు.

బీమా చెక్కు అందజేత

జహీరాబాద్ టౌన్: కోహీర్ మండలం సజ్జపూర్‌కు చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త కుటుంబ సభ్యులకు బీమా చెక్కును ఆదివారం ఎమ్మెల్యే మాణిక్‌రావు అందచేశారు. సజ్జపూర్ బడంపేటకు చెందిన దయాకర్ రోడ్డు ప్రమాదంలో చనిపోయారు. ఆయనకు బీఆర్‌ఎస్ సభ్యత్వం ఉండడంతో మంజూరైన రూ. 2లక్షల బీమా చెక్కును మృతుని భార్యకు ఎమ్మెల్యే అందచేశారు. ఈ కార్యక్రమంలో కోహీర్ మండల అధ్యక్షుడు నర్సింలు యాదవ్, జహీరాబాద్ మండల అధ్యక్షుడు ఎంజీ రాములు యాదవ్, బడంపేట్ ఆలయ చైర్మన్ రాజు స్వామీ, సర్పంచ్ నర్సింహులు, ఇజ్రాయేల్ పాల్గొన్నారు.

ఆస్తి దక్కనివ్వడం లేదని హత్య

నిందితుడి రిమాండ్

- 24గంటల్లోనే మిస్టరీని ఛేదించిన పోలీసులు
- హత్య వివరాలు వెల్లడించిన సీఐ సంజయ్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ సంజయ్

మెదక్ మున్సిపాలిటీ: మెదక్ పట్టణంలోని పెద్ద బజార్ వీధిలో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురైన మిస్టరీని పట్టణ పోలీసులు 24గంటల్లోనే ఛేదించారు. నిందితుణ్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ సంజయ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మెదక్‌పట్టణంలోని గాంధీ నగర్‌వీధికి చెందిన పొట్టిపల్లి శ్రీనివాస్(50) స్థానిక పెద్ద బజార్‌లో కుట్టు మిషన్ల రిపేర్ దుకాణం నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 20న ఇంట్లో నుంచి పనికని వెళ్లిన శ్రీనివాస్ తిరిగి ఇంటికి రాలేదు. ఈ క్రమంలో అతని భార్య సంతోష పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు మిస్సింగ్ కేసుగా నమోదు చేసుకున్నారు. శనివారం మృతుడు శ్రీనివాస్‌కు సంబంధించిన బైక్ స్థానిక పిట్లం చెరువులో లభ్యమైంది. దాని ఆధారంగా పోలీసులు మృతుని ఇంటికి వెళ్లి వివరాలు సేకరించారు. అనంతరం శ్రీనివాస్ నిర్వహిస్తున్న దుకాణం నుంచి దుర్వాసన వస్తుండడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందజేశారు. అక్కడికి చేరుకున్న పోలీసులు దుకాణానికి వేసిన తాళాన్ని పగులగొట్టి లోపలికెళ్లి చూడగా శ్రీనివాస్ తలకు బలమైన గాయం తగిలి మృతి చెంది ఉన్నాడు. పోలీసులు తమదైన శైలీలో విచారణ ప్రారంభించి 24గంటల్లోనే నిందితుడిని పట్టుకున్నారు. మెదక్ పట్టణంలోని గాంధీనగర్‌లో నివాసం ఉండే మృతుని బామ్మరిది సంతోష్‌ను అసలు నిందితుడిగా గుర్తించారు. సంతోష్ తన తండ్రి జ్ఞానోబా పేరున గల ఆస్తిని తనకు కాకుండా అడ్డుకుంటున్నాడని బావ శ్రీనివాస్‌పై కక్ష పెంచుకున్నాడు. ఈ క్రమంలోనే ఈ నెల 20వ తేదీన శ్రీనివాస్ నడిపించే షాపులోనే ఇద్దరు కలిసి మద్యం సేవించారు. బావ శ్రీనివాస్‌కు అతిగా మద్యం తాగించాడు. మద్యం ఎక్కువ కావడంతో అక్కడే పడిపోయిన శ్రీనివాస్‌ను తల, మెడపై సుత్తితో కొట్టాడు. చనిపోయినట్లు నిర్ధారించుకున్నంకా సంతోష్ అక్కడి నుంచి బయటకు వచ్చాడు. మృతదేహాన్ని దుకాణంలోనే ఉంచి బయట నుంచి తాళం వేశాడు. శ్రీనివాస్‌కు చెందిన బైక్‌ను తీసుకెళ్లి సమీపంలోని పిట్లం చెరువులో పారవేసి ఏమి తెలియనట్లు ఇంటికి వెళ్లిపోయాడు. హత్య సంఘటనపై తమదైన శైలీలో విచారణ చేపట్టగా సంతోష్ తన నేరాన్ని ఒప్పుకున్నట్లు సీఐ తెలిపారు. నిందితుణ్ని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

విద్యుత్ వైర్లను తాకి కుక్కలు మృత్యువాత

హత్నూర: వేలాడుతున్న విద్యుత్ వైర్లను తాకి ఊరకుక్కలు మృతి చెందిన ఘటన హత్నూరలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి..హత్నూర పరిధిలోని పొలాల్లో వేలాడుతున్న విద్యుత్ వైర్లు గాలికి తెగిపడ్డాయి. విషయం తెలుసుకున్న స్థానికులు వెంటనే ఈ విషయంపై లైన్‌మెన్‌కు సమాచారం ఇచ్చారు. అక్కడికి చేరుకున్న లైన్‌మెన్ కరెంటు సరఫరా బంద్‌చేసి వైర్లను చుట్టి అక్కడే పడేశాడు. తిరిగి కరెంట్ సరఫరా చేసి వెళ్లిపోయాడు. అక్కడ చిందరవందరగా ఉన్న విద్యుత్ వైర్లను తాకి అటుగా వెళ్తున్న ఊర కుక్కలు మూడు మృత్యువాత పడ్డాయి. ఉదయం అక్కడికి స్థానికులు, రైతులు వెళ్లకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని వారు వాపోతున్నారు.

లైన్‌మెన్‌ను తొలగించాలి

విధులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న లైన్‌మెన్‌ను వెంటనే తొలగించాలని స్థానికులు డిమాండ్ చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన లైన్‌మెన్‌ను తొలగించేందుకు ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని ఏఈ పేర్కొన్నారు.

చెత్తకుప్పలో సర్కారు మెడిసిన్

నారాయణరావుపేటలో ఘటన



పారబోసిన మందులు

సిద్దిపేటరూరల్: పేద ప్రజల ఆరోగ్యం కోసం కోట్లు ఖర్చు చేసి ప్రభుత్వం ఉచితంగా మందులను అందిస్తుంటే.. కొంతమంది సిబ్బంది నిర్లక్ష్యం వల్ల కాలం తీరకముందే మందులను చెత్తకుప్పల్లో పడేస్తున్నారు. నారాయణరావుపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ పీహెచ్‌సీకి చెందిన మందులు డంపింగ్‌యార్డులో దర్శనమిచ్చిన ఘటన మండల పరిధిలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. కాలం చెల్లిన మందులతో పాటు సమయం ఉన్న మందులను గుర్తు తెలియని వ్యక్తులు చెత్తకుప్పలో పడేశారని స్థానికులు పేర్కొన్నారు. ఈ విషయంపై జిల్లా వైద్యాధికారి కాశీనాథ్, నారాయణరావుపేట వైద్య అధికారి బాపురెడ్డిని వివరణ కోరగా..ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో చెత్తకుప్పలో పడేసిన మందుల వివరాలు తమకు తెలియదన్నారు. ఈ విషయంపై విచారణ చేస్తామని వారు తెలిపారు.

చోరీకి యత్నించిన దంపతుల రిమాండ్

నర్సాపూర్: ఆటోలో ఎక్కిన మహిళను కత్తితో బెదిరించి ఆమె బంగారు నగలు తస్కరించేందుకు ప్రయత్నించిన దంపతులను రిమాండ్ చేసినట్లు ఎస్‌ఐ శివకుమార్ చెప్పారు. వివరాలు ఇలా ఉన్నాయి..ఆవంచ గ్రామ సమీపంలో ఆటోలో ఎక్కించుకున్న మహిళ అమృత మెడలో నుంచి బంగారు నగలు దొంగిలించాలని ప్రయత్నించిన ఆటో డ్రైవర్ ఉరాడి సురేశ్, భార్య స్వప్నలను రాష్ట్ర మహిళ కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి తన భద్రత సిబ్బందితో పట్టుకుని పోలీసులకు అప్పగించిన విషయంలో ఆదివారం ఉదయం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ శివకుమార్ తెలిపారు.

అంకితభావం, చిత్తశుద్ధితోనే సముచిత గౌరవం

నవోదయ విద్యాలయ సమితి డిప్యూటీ కమిషనర్ గోపాలకృష్ణ



రమేష్‌రావును సన్మానిస్తున్న డీసీ గోపాలకృష్ణ తదితరులు

వర్గల్(గజ్వేల్): విధినిర్వహణలో అంకితభావం, చిత్తశుద్ధితోనే సముచిత గౌరవం దక్కుతుందని నవోదయ విద్యాలయ సమితి హైదరాబాద్ రీజియన్ డిప్యూటీ కమిషనర్ గోపాలకృష్ణ అన్నారు. ఆటుపోట్లు అధిగమించి కఠోరశ్రమతో ప్రిన్సిపాల్‌గా రమేష్‌రావు ఎన్నెన్నో విజయాలతో సమర్థత చాటుకున్నారని ప్రశంసించారు. వర్గల్ నవోదయ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న రమేష్‌రావు ఉద్యోగవిరమణ సందర్భంగా ఆదివారం వైస్‌ప్రిన్సిపాల్ సత్యవతి అధ్యక్షతన నిర్వహించిన సన్మానసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. వరంగల్, నాందేడ్, లాతూర్, రంగారెడ్డి, మెదక్ జిల్లాలో విధులు నిర్వహించి అంకితభావానికి ఆయన సింబల్‌గా నిలిచారని అభినందించారు. ఆయన శేష జీవితం సుఖ సంతోషాల మధ్య గడపాలని ఆకాంక్షించారు. ప్రిన్సిపాల్‌గా తన ఉద్యోగ ధర్మంలో ప్రతీఒక్కరు సహకరించినందుకు ధన్యవాదాలని ప్రిన్సిపాల్ రమేష్ రావు పేర్కొన్నారు. వర్గల్ విద్యాలయ వైస్ ప్రిన్సిపాల్ సత్యవతి, గ్రంథాలయాధికారి కృష్ణారెడ్డి మాట్లాడారు. ప్రిన్సిపాల్ రమేష్‌రావును డిప్యూటీ కమిషనర్ గోపాలకృష్ణతోపాటు పలువురు నవోదయ ప్రిన్సిపాల్స్, స్థానిక నవోదయ విద్యాలయ బోధన, బోధనేతర సిబ్బంది, హైదరాబాద్ రీజియన్ నవోదయ పూర్వవిద్యార్థుల కోఆర్డినేటర్ సామల్ల సాయిప్రేమ్, బంధుమిత్రులు ఘనంగా సన్మానించారు.

హోటల్ నిర్వాహకులకు జరిమానా

సాక్షి ఎఫెక్ట్



వంటశాలను పరిశీలిస్తున్న అధికారులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని సోని ఫ్యామిలీ రెస్టారెంట్ నిర్వాహకులకు మున్సిపల్ అధికారులు రూ.8వేలు జరిమాన విధించారు. బాత్‌రూంలో బిర్యానీ బియ్యం కడుగుతున్నారని తెలిసిన నేపథ్యంలో శనివారం సాక్షిలో 'బాత్‌రూం బిర్యానీ' పేరిట కథనం ప్రచురితం అయ్యింది. దీనికి స్పందించిన ఫుడ్ సేఫ్టీ, మున్సిపల్ అధికారులు ఆదివారం వంటశాలను, హోటల్ పరిశుభ్రతను పరిశీలించారు. హోటల్‌లో వండిన ఆహార పదార్థాలను ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్‌కు తరలించారు. 14 రోజుల్లో వీటి ఫలితాలు వస్తాయని, నిబంధనలు పాటించని హోటల్ నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఫుడ్ సేఫ్టీ ఇన్‌స్పెక్టర్ ధర్మేంద్ర, మున్సిపల్ అధికారులు మల్లికార్జున్, సతీశ్, తదితరులు పాల్గొన్నారు.

మీరు ఊరికి వెళ్తున్నారా.. జర భద్రం..!

మైకుల ద్వార పోలీసుల ప్రచారం



ప్రచార వాహనాన్ని ప్రారంభిస్తున్న ఏసీపీ నరసింహారావు (ఫైల్)

రామచంద్రాపురం(పటాన్‌చెరు): వేసవి సెలవులు కావడంతో ఊరికి వెళ్లేవారు పలు జాగ్రత్తలు తీసుకోవాలని కోరుతూ రామచంద్రాపురం పోలీసులు మైకుల ద్వార ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. అందుకు సంబంధించిన ప్రచార వాహనాన్ని కొద్ది రోజుల క్రితం మియాపూర్ ఏసీపీ నరసింహారావు ప్రారంభించారు. ఊరికి వెళ్లాల్సి వస్తే బంగారం, వెండి ఆభరణాలను బ్యాంక్ లాకర్లోగానీ ఇంట్లో ఓ రహస్య ప్రదేశంలో భద్రపరుచుకోవాలని వారు సూచిస్తున్నారు. సెలవుల్లో బయటకు వెళ్తున్నప్పుడు ఇంటికి సెక్యూరిటీ అలారం లేదా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచిస్తున్నారు. రాత్రి సమయాల్లో స్నేహితులను కానీ, బంధువులను కానీ ఇంట్లో ఉండేటట్టు ఏర్పాటు చేసుకోవాలన్నారు. లేని పక్షంలో స్థానిక పోలీస్ స్టేషన్లో సమాచారం ఇచ్చి వెళ్లాలన్నారు.

- తమ ద్విచక్ర వాహనాలకు తప్పని సరిగా తాళం వేసుకోవాలన్నారు.
- అవసరమైతే వాహన చక్రాలకు చైన్‌తో తాళం వేయాలని సలహాఇస్తున్నారు.
- ఎక్కడికి వెళ్లినా ఇంట్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఆన్‌లైన్లో ఎప్పటికప్పుడు చూసుకునే విధంగా మెసులు బటాటు చేసుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు. ప్రధానంగా ఇంటికి తాళం వేసినప్పుడు అది బయటకు కనిపించకుండా కర్టెన్ ఏర్పాటు చేసుకోవాలని చెబుతున్నారు. రాత్రి సమయంలో ఇంట్లో బయట విద్యుత్ దీపాలు వేసి ఉంచాలన్నారు. ముఖ్యంగా ఇంట్లో నుంచి బయటకు వెళ్లే విషయాన్ని సోషల్ మీడియాలో ఇతరులకు షేర్ చేయడం మంచిది కాదన్నారు.
- ఈ విషయాలపై ప్రతి కాలనీల్లో పోలీస్ అధికారులు ప్రజలకు చైతన్యం తెచ్చేందుకు ప్రత్యేక దృష్టి సారించారు.

ప్రజలు సహకరించాలి



దొంగతనాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. అందుకు ప్రజలు కూడా సహకరించాలి. ప్రధానంగా వేసవి సెలవులు రావడంతో ప్రతి ఒక్కరూ వారి వారి సొంతూళ్లకు వెళ్తుంటారు. అలాంటి సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రచార వాహనాల ద్వారా, స్వయంగా కాలనీల్లో మా సిబ్బంది ప్రజలను చైతన్యపరుస్తున్నారు.

–పి. నరసింహారావు, ఏసీపీ, మియాపూర్

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

FLAT FOR SALE

- LAUNCHING OFFER: రూ. 3లక్షలకే 18 లక్షల విలువ గల 1050Sft. గల 2BHK Flat సొంతం చేసుకోండి. ప్రముఖ పుణ్యక్షేత్రం యాదాద్రి Temple నుండి 2కి.మీ. మాత్రమే. ఫోన్: 9948525151, 6262838353 మార్కెటింగ్ కు ఏజెంట్లు కావలెను. [HA-3176]

WANTED

- ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. జీతం: 15000+ ఇన్సెంటివ్స్, ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-785870]
- పర్మినెంట్ జాబ్స్, ప్రముఖ సంస్థ నందు డేటా ఎంట్రీ ఆపరేటర్స్, సూపర్‌వైజర్, క్లర్క్, ఆఫీస్ బాయ్స్ కావలెను. Qul: 5 to డిగ్రీ, జీతం: 15000 to 35000 ఫోన్ : 9440828190 [HA-6127]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.